www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 4 మే 2023

5

పశ్చిమ గోదావరి

నేడు ఉమ్మడి జిల్లాలో చంద్రబాబు పర్యటన



ఉంగుటూరు: టిడిపి అధినేత చంద్రబాబు ఈ నెల నాలుగో తేదీ గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఉంగుటూరు, తాడేపల్లిగూడెం మండలాల్లో పర్యటించనున్నారు. అకాల వర్షాలకు ధాన్యం రైతులు పడుతున్న ఇబ్బందులు, పంట నష్టాలను ఆయన స్వయంగా పరిశీలించనున్నారు. ఆయన విజయవాడ నుంచి నేరుగా మధ్యాహ్నం 2.30 గంటలకు ఉంగుటూరు మండలం బాదంపూడిలోని కెనాల్ గట్టు రోడ్డుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 2.45కు తాడేపల్లిగూడెం మండలం నందమూరు చేరుకుని నాలుగు గంటలకు వరకూ పొలాలు, ధాన్యం పరిశీలించి రైతులతో మాట్లాడతారు. అనంతరం కోనసీమ జిల్లా రామచంద్రపురం బయల్దేరి వెళ్తారు.

భీమవరంలో..

పెల్లుబికిన ఉక్కు పోరు

జిల్లా వ్యాప్తంగా నిరసనల హోరు - కార్మిక, ప్రజాసంఘాల, వామపక్షాల ఆధ్వర్యాన రాస్తారోకోలు, ధర్నాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

'విశాఖ ఉక్కు కోసం మా ప్రాణాలైనా అర్పిస్తాంగానీ పరిశ్రమపై హక్కును వదులుకునేది లేదు' అంటూ పెద్దసంఖ్యలో జనం సిపిఎం, సిపిఐ, కార్మిక సంఘాల ఆధ్వర్యాన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై కన్నెర్ర చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకాన్ని ఆపాల్సిందేనంటూ ఎక్కడికక్కడ రోడ్లపై బైఠాయించి రాస్తారోకోలు నిర్వహించారు. కేంద్రం దిగి రాకపోతే తమ పోరు ఉధృతం చేస్తామని, అరెస్టులకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

తణుకులో నేతల అరెస్టులు

భీమవరం: త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును అమ్మనీయబోమని, రాష్ట్రాభివృద్ధిలో కీలకంగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వదులుకోబోమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపులో భాగంగా స్థానిక ప్రకాశం చౌక్‌లో కార్మిక సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు, ప్రయివేటీకరణను అడ్డుకుంటాం-స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం' అనే నినాదాలతో పట్టణం మార్మోగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ 32 మంది ప్రాణత్యాగాలు, వేలాది మంది రైతుల భూములతో నిర్మించుకున్నామన్నారు. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసారు. గ్రామస్థాయిలో కూడా విశాఖ ఉక్కును అమ్మొద్దు అని నినదిస్తుంటే కేంద్ర ప్రభుత్వానికి చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లే ఉందని విమర్శించారు. కొంతమంది కార్పొరేట్ల అభివృద్ధి కోసం కోట్లాది మంది ప్రజల ఉపాధిని బిజెపి ప్రభుత్వం దెబ్బతీస్తుందని మండిపడ్డారు. 22 వేల ఎకరాల్లో ఉన్న విశాఖ ఉక్కు రూ.నాలుగు లక్షల కోట్లు విలువ చేస్తుందని, కేవలం రూ.30 వేల కోట్లకు విదేశీ కంపెనీలకు, అదానీకి ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు బ్యాంకింగ్, రైల్వే, బీమా, రోడ్డు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలతో పాటు అన్ని ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తున్నారని, దీనిని ప్రజలందరూ వ్యతిరేకించి ప్రత్యక్ష పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే మహోద్యమంలో నిర్మించుకున్నదే విశాఖ ఉక్కు అని గుర్తు చేశారు. విభజన తర్వాత రాష్ట్రంలో ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ భారీ పరిశ్రమ విశాఖ ఉక్కు మాత్రమేనన్నారు. తక్షణం ప్రయివేటీకరణ ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం కారుచౌకగా అమ్మేస్తుంటే రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఓటుబ్యాంకు రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. అధికారం కోసం మోడీ విధానాలను అంటకాగడం చూడడం రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేయడమేనన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు దండు శ్రీనివాసరాజు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకించే ప్రజలందరూ ఐక్యం కావాలన్నారు. వామపక్షాలు, కార్మికసంఘాలు చేసే ఆందోళనకు ప్రజలందరూ కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జె.సత్యనారాయణ, ఎం.ఆంజనేయులు, డి.త్రిమూర్తులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కె.క్రాంతిబాబు, సిపిఐ నాయకులు మల్లుల సీతారామ్‌ప్రసాద్, మల్లుల శ్రీనివాస్, ఏటిటి ఆనందరావు, ఆకలి రాము, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు కనుమూరి వెంకటపతిరాజు, దండు అప్పలరాజు, దుర్గరాల శ్రీనివాస్, వాటాల రాంబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో రాస్తారోకో

తాడేపల్లిగూడెం: సిపిఎం, సిపిఐ, సిఐటియు ఆధ్వర్యాన స్థానిక పోలీస్ ఐల్యాండ్ వద్ద బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను కేంద్రం ఉపసంహరించుకునే వరకూ పోరాటాలు ఆగవని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో చిటికిన రాము, పోతు శ్రీను, నరమాల కృష్ణ, మేట్రేటి రమణ, పులిమంతుల రమణ, కుంచంగి నానాజీ, గొర్రెల సతీష్‌కుమార్, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

తణుకురూరల్: విశాఖ ఉక్కు ఆంధ్రుల ఆత్మగౌరవానికి సంబంధించినదని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, జనసేన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు నేతలను అరెస్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాస్తారోకో సందర్భంగా సిపిఎం నాయకులు పివి.ప్రతాప్, సిపిఐ నాయకులు బొద్దాని నాగరాజు, కాంగ్రెస్ నాయకులు కడలి రామారావు, దిర్సిపో రామకృష్ణ మాట్లాడుతూ.. ఇప్పటికైనా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని, లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నామన వెంకటేశ్వరరావు, టి.అప్పలస్వామి, బొద్దాని కృష్ణకిషోర్, అప్పారి శ్రీనివాస్, బొద్దాని మురళి, అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు పాల్గొన్నారు.

పాలకొల్లు: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వెంటనే నిలిపివేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ ఎంత పోరాటమైనా చేసి విశాఖ ఉక్కును రక్షించుకుంటామని చెప్పారు. మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేసి అదాని, అంబానీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, నేతలు చల్లా సోమేశ్వరరావు, యర్రా అజయ్, పురుషోత్తం మాట్లాడారు.

ఆచంట: విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకాన్ని మోడీ ప్రభుత్వం ఆపేవరకూ పోరాడుతూనే ఉంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు వద్దిపర్తి అంజిబాబు, ఎస్‌విఎన్.శర్మ అన్నారు. సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక రామేశ్వరస్వామి ఆలయం వద్ద ఆర్అండ్‌బి రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు, శర్మ మాట్లాడారు. అమరవీరుల బలిదానాలు, త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు రాష్ట్రంలోని ప్రజానీకమంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు సిర్రా నర్సింహమూర్తి, తోటపల్లి సత్యనారాయణ, తలుపూరి బుల్లబ్బాయి, మన్నె బ్రహ్మయ్య, మానుకొండ రాంబాబు, సిఐటియు నాయకులు బోడి శ్రీను, మొనవర్తి వెంకట్రావు, నెక్కంటి నాగేశ్వరరావు, బోడి నాగేశ్వరరావు, దేవర రాంబాబు, బాలాజీ పాల్గొన్నారు.

కాళ్ల : విశాఖ ఉక్కును ప్రయివేటీకరించొద్దని సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ అన్నారు. స్థానిక రామాలయం సెంటర్‌లో బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ, కాంగ్రెస్ నర్సాపురం పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ అంకం సీతారాం మాట్లాడుతూ మోడీ ప్రధాని అయ్యాక దేశంలో ప్రభుత్వరంగ ఆస్తుల అమ్మకం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో తిరుమాని శ్రీను, చాట్ల యేసురత్నం, బాలయ్య, రాజు నాయక్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు: విశాఖ ఉక్కు పరిశ్రమ విక్రయాన్ని నిలుపుదల చేయాలంటూ స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల నాయకులు యడ్ల చిట్టిబాబు మాట్లాడారు. వీరా పాండురంగారావు, కొత్తపల్లి నాగరాజు, బజార్ జట్టు కార్మికులు పాల్గొన్నారు.

ఉండి: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ స్థానిక మెయిన్ సెంటర్లో సిఐటియు నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ మండల కార్యదర్శి కొట్టాడ వెంకటేశ్వరరావు, నేతలు కడలి నాగేశ్వరరావు, మజ్జి నాగేశ్వరరావు, వంజరపు సూర్యనారాయణ, కట్టా రవి, చేబోలు ఆంజనేయులు, కంది గణపతి, చేబోలు వెంకన్న, కేశబోయిన రాము, రాచర్ల శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

నరసాపురంటౌన్: పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యాన విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కవురు పెద్దిరాజు, ఎఐటియుసి నాయకులు నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కేంద్ర పరిశ్రమలు పెట్టి ప్రజలకు న్యాయం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం ఉన్న పరిశ్రమలను మూసేస్తూ, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కారు చౌకగా అమ్మే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ముచ్చర్ల త్రిమూర్తులు, పొన్నాడ రాము, నాయకులు పొగాకు నారాయణరావు, కొరాడ బద్రి తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిరసిస్తూ చించినాడలో జాతీయ రహదారిపై సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడగా నేతలు దేవ సుధాకర్, మాసవరపు సుబ్బారావు, మొమ్మిడివరపు ఈశ్వరుడు, ఆకుమర్తి శ్రీను, ఐద్వా నాయకులు సరిపల్లి జయప్రభ, కానేటి ప్రియాంక, ముస్కుడి జయశ్రీ పాల్గొన్నారు.

పాలకోడేరు: ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.అసిరియ్య అన్నారు. శృంగవృక్షంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని కోరుతూ 216 జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, సుబ్బారావు, అప్పారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లులో ధర్నా

నరసాపురంలో ఆందోళన

కల్లాల్లో.. కన్నీరు..!

వరి రైతుల వేదన వర్ణనాతీతం

లారీలు, సంచుల్లేక అవస్థలు

ముక్క పేరుతో తారాస్థాయికి మిల్లర్ల దోపిడీ

వర్షాలకు తడిసి ముద్దవుతున్న ధాన్యం.. దిక్కుతోచని అన్నదాత

రెండు జిల్లాల్లోనూ దాదాపు 50 శాతం పంట కల్లాల్లోనే

కనీసం రైతులను పలుకరించని మంత్రులు, ఎంఎల్ఎలు

ధాన్యం రాశిపై పరదాలు కప్పుతున్న రైతు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతుల కంట కన్నీరొలుకుతోంది. కల్లాల్లో తడిసిన ధాన్యం చూసి అన్నదాత విలవిల్లాడిపోతున్నాడు. ఒకపక్క లారీలు లేక, మరోపక్క సంచులు అందక, చితుకు పేరుతో మిల్లర్ల దోపిడీ వంటి కష్టాలతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటనలు గుప్పిస్తున్నా లారీలు మాత్రం పంపకుండా నిలిపివేయడంతో రైతన్న పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రైతుల వేదన చూసిన వారంతా 'అయ్యో.. అన్నదాత' అనే పరిస్థితి ఏర్పడింది.



రంగు మారిన ధాన్యం

రబీ ధాన్యం కొనుగోలులో ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి సంబంధం లేకుండాపోయింది. రైతులు పడుతున్న కష్టాలను అధికారులు ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఏలూరు జిల్లాలో 3.90 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమలో 9.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటి వరకూ అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం చూస్తే 50 శాతం ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. కళ్లాల్లో ఇంకా సగం పంట ఉండిపోయింది. గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటంతా తడిసి ముద్దవుతోంది. రాశులు చేసిన ధాన్యం కిందిభాగం పూర్తిగా తడిసిపోయి మొక్కలు వస్తుండగా, కోత దశలో ఉన్న పంట మాసూలు చేసేందుకు వీల్లేకుండా పోయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. వర్షం ఎప్పుడు పడుతుందో తెలీక నానాయాతన అనుభవిస్తున్నారు. బాగున్న ధాన్యం విక్రయించేందుకు ప్రయత్నించినా లారీలు, సంచులు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది.

వెంటాడుతున్న లారీలు, సంచుల సమస్య

జిల్లాలో ఆది నుంచి లారీలు, సంచుల సమస్య రైతులను వెంటాడుతోంది. ఏప్రిల్ 16న ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినా ఇప్పటికీ లారీలు, సంచుల సమస్య పరిష్కారం కాలేదు. రైతులే సొంతంగా సంచులు, లారీలు సమకూర్చుకోవాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో కిరాయి నిమిత్తం ఖర్చు తడిసి మోపెడవుతోంది. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం మంగళవారం లారీలను పూర్తిగా నిలిపివేసింది. మండలానికి ఒక్క లారీ రావడమే గగనంగా మారింది. ఉంగుటూరు, దెందులూరు వంటి మండలాల్లో సమస్య మరింత తీవ్రంగా ఉంది. పశ్చిమలోనూ పరిస్థితి ఇదేవిధంగా ఉంది. లారీలు, సంచులు రైతులకు అందించకపోవడంతో ధాన్యం కొనుగోలు సజావుగా సాగడం లేదు. మరోపక్క ధాన్యం మిల్లుకు పంపించిన తర్వాత ముక్కవుతుందంటూ పెద్దఎత్తున ధరలో కోత పెడుతున్న పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో పౌర సరఫరాలశాఖ అధికారులు ధాన్యం కొనుగోలులో పూర్తిగా నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. అధికారులు చెబుతున్న మాటలకు.. రైతులు పడుతున్న ఇబ్బందులకు పొంతన లేకుండాపోయింది. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు రైతుల్లో తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. వర్షాలు వీడకపోవడంతో మొలకెత్తిన, తడిసిన ధాన్యం పరిస్థితి ఏమిటో రైతులకు అర్థం కాకుండాపోయింది.

'మూడెకరాల ధాన్యం తడిసిపోయింది

జోగిరామారావు, అమ్మపాలెం, పెదవేగి మండలం

ఖరీఫ్ ధాన్యం కుప్పలు వేసి మాసూలు చేశాం. కురుస్తున్న వర్షాలకు మూడెకరాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యి మొలకలు వచ్చాయి. దీనిపై ఏం చేయాలో అర్థం కావడం లేదు. వర్షాలతో ధాన్యం ఆరబెట్టేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా మంత్రులు, ఎంఎల్ఎలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం రైతులను పలుకరించకపోవడం గమనార్హం. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తే సమస్యలు తెలుస్తాయి. రైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది. అయితే ప్రకటనలకు మాత్రమే ప్రజాప్రతినిధులు పరిమితం కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లారీలు లేవు.. సంచులు ఇవ్వలేదు

సూరత్తుల శ్రీనివాస్, కాగుపాడు, ఉంగుటూరు మండలం

'18 ఎకరాల్లో వరిసాగు చేశాను. ఏప్రిల్ 12న మాసూలు చేశాను. సంచులు ఇవ్వకపోవడంతో సొంతంగా సమకూర్చుకోవాల్సి వచ్చింది. లారీలు రాకపోవడంతో సొంతంగా లారీ ఏర్పాటు చేసుకుని 467 సారలతో ఒకలోడు మిల్లుకు పంపించాం. ముక్కపేరుతో రూ.27 వేలు కోత వేస్తామంటున్నారు. ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది.'

రైతుల నుండి ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రైతుల నుండి ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతు మిల్లర్ల వద్దకు ఎట్టి పరిస్థితుల్లో వెళ్లాల్సిన అవసరం లేదని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పునరుద్ఘాటించారు. బుధవారం స్థానిక బివి రాజు కళాశాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లకు సంబంధం లేదనే విషయం తెలియక ఇంకా రైతులు అపోహ పడుతున్నారన్నారు. రైతు ఆర్‌బికెలో ధాన్యం అప్పగించి రశీదు పొందే వరకే రైతు బాధ్యత అని, తర్వాత మిల్లర్లు పిలిచినా వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కొంతమంది మిల్లర్లు రైతులకు ఫోన్ చేసి నూక అవుతుంది మిల్లుకు రావాలని పిలుస్తున్నారనే ఫిర్యాదులు అందడంతో వెంటనే స్పందించి జిల్లాలో రెండు రైస్ మిల్లులను సీజ్ చేసినట్లు తెలిపారు. బాయిల్డ్ రైస్ ఐదు లక్షల మెట్రిక్ టన్నులు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని, ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. గత సీజన్లో 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇంకా రూ.33 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉందని, వెంటనే చెల్లిస్తామని తెలిపారు. రైతుల బ్యాంకు ఖాతాలు సరిగా లేక ఈ సొమ్ము ఆగిందని, వాటిని సరి చేస్తున్నారని తెలిపారు.

తణుకు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల అధికారులు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో బుధవారం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మిల్లుల వద్ద ధాన్యం ఆడిస్తుందని, రైతులు మిల్లర్ల వద్దకు వెళ్లొద్దని అన్నారు. అకాల వర్షాలతో రైతులకు ఇబ్బంది కలుగుతుందని, జిల్లా యంత్రాంగం, రైస్‌మిల్లర్లు సమిష్టిగా పని చేసి రైతు నష్టపోకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొబైల్ మినీ మిల్లులు ఏర్పాటు చేసి, తహశీల్దార్, రైతు ఎదురుగానే ధాన్యాన్ని ఆడించి ఎంతశాతం నూక వస్తుందో అక్కడే నిర్ణయిస్తారని తెలిపారు. రైతు వద్ద నుండి ఒక్క గింజ కూడా మిగలకుండా కొనుగోలు చేస్తామన్నారు. కృష్ణా జిల్లా నుండి లక్ష గోనె సంచులు పశ్చిమగోదావరి జిల్లాకు ఇవ్వటం జరుగుతుందని, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ 20 లక్షల సంచులు ఇవ్వడానికి హామీ ఇచ్చిందని తెలిపారు. మిల్లర్లకు బకాయిలను త్వరలోనే చెల్లిస్తామన్నారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ ఎమ్‌డి వీరపాండియన్, పశ్చిమ, తూర్పు, ఏలూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, తేజ్‌భరత్, లావణ్య వేణి, పౌరసరఫరాల శాఖ ఆయా జిల్లాల మేనేజర్లు, అధికారులు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

మిల్లర్లకు కలెక్టర్ ప్రశాంతి హెచ్చరిక

ఆర్‌బికె సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఆచంట

రైతులను ఇబ్బంది పెట్టేలా మిల్లర్లు వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం స్థానిక ఆర్‌బికెలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తేమ, నూక శాతం ఎక్కువగా ఉంటుందని మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. మండలంలో వారం రోజుల నుంచి దాళ్వా మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయని, ఈ ప్రాంతంలో రైస్‌మిల్లులు తక్కువగా ఉండటంతో ప్రత్యామ్నాయం చూపాలని మండల వ్యవసాయాధికారి కె.రాజశేఖర్ కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జగనన్న కాలనీల్లో వసతి సౌకర్యాలు మెరుగుపర్చాలని, పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జగన్నాథరావు, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో భారీ వర్షం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలో బుధవారం రెండు గంటల పాటు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీనికితోడు అస్తవ్యస్థంగా ఉన్న డ్రెయినేజీల్లోని మురుగునీరు రోడ్లపైకి చేరడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పెనుమంట్ర: కొనసాగిన అకాల వర్షానికి బుధవారం మండలంలో పలు ప్రాంతాల్లో వరిపైరు నేలనంటింది. పొలమూరు, పెనుమంట్ర, ఆలమూరు, మార్టేరు, మల్లిపూడి తదితర గ్రామాల్లో 10 గంటల ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై గాలులతో భారీ వర్షం కురిసింది. ఇప్పటికే వర్షాలు, గాలులకు అక్కడక్కడా పడిపోయిన చేలు బుధవారం వర్షం, గాలులతో పూర్తిగా నేలనంటాయి. మండలంలో 12 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటి వరకు నాలుగు వేల ఎకరాల్లోనే వరి కోతలు పూర్తయ్యాయని ఇన్‌ఛార్జి ఎఒ ఎం.జ్యోత్స్న తెలిపారు.

పెనుమంట్ర మండలంలో నేలనంటిన వరి

ఆటల పోటీల నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి - పాలకోడేరు

కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. విస్సాకోడేరు గాంధీపేట రామాలయం వద్ద మేడే వారోత్సవ ముగింపు సంబరాల్లో భాగంగా ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోపాలన్ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఆక్రీయ, సిఐటియు మండల కార్యదర్శి వైఎస్‌ఎన్.మూర్తి, కె.గోపాల్‌రాజు, కె.వెంకన్న, బైరెడ్డి శ్రీను, సుంకర రాంబాబు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానికులు ఉపయోగించుకోవాలని జల్లయ్యపేట గ్రామ సర్పంచి నక్కసాని బంగారయ్య అన్నారు. పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో మాట్లాడుతూ కంటిచూపుపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

వేసవి ఉద్దేశించి ప్రజల సౌకర్యార్థం ఆచంట వేమవరం బస్టాండ్ పక్కన మహజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్ర కేంద్రాన్ని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కనపాల వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రయాణికులు ఈ మజ్జిగ చలివేంద్ర కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కనపాల వెంకటేశ్వరరావు ఆకుమర్తి సుబ్బారావు పసల సై మున్ జగ్గయ్య సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జలాలుద్దీన్ బాబా మృతి తీరని లోటు

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జలాలుద్దీన్ బాబా మృతి తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఆప్తమిత్రుడిని కోల్పోయానని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి సీనియర్ నాయకులు, ముస్లిం మైనార్టీ సంఘ పెద్ద జలాలుద్దీన్ బాబా అనారోగ్యంతో మరణించారు. బుధవారం ఆయన మృతదేహానికి ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సందర్శించి కన్నీరుమున్నీరయ్యారు. తమ కుటుంబంతో జలాలుద్దీన్ బాబా చిన్ననాటి నుంచి కూడా కలిసిమెలిసి ఉండేవారని, కష్టసుఖాల్లో తన వెంటే అండగా ఉన్నారని, ఎన్నడూ కూడా పదవులను ఆశించలేదని, నిస్వార్థంగా తన కోసం, పార్టీ కోసం బాబా పని చేసేవారని చెప్పారు. ముందుగా బాబా భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాబా కుటుంబానికి తాను అండగా ఉంటానని చెప్పారు.

అందుబాటులో ఉన్న మిల్లులకు ధాన్యం విక్రయించుకోవచ్చు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సిఎం జగన్మోహన్ రెడ్డి తాజాగా రైతులకు మరింత మేలు జరిగే విధంగా నిర్ణయం చేశారని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ధాన్యాన్ని విక్రయించుకోవడానికి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దగ్గర్లో ఉన్న మిల్లులకు ధాన్యాన్ని విక్రయించుకునే అవకాశాన్ని కల్పించారన్నారు. ఏ మిల్లులకు ధాన్యాన్ని విక్రయించుకున్నప్పటికీ రైతు భరోసా కేంద్రంలో వివరాలు నమోదు చేయించుకోవాలని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ 'ఫేజ్-2లో' భాగంగా వీరవాసరం మండల పరిధిలోని రాయకుదురు గ్రామానికి చెందిన ఆర్బి గ్రామ సంఘానికి రూ.20 లక్షల విలువైన పవర్ టిల్లర్లు, వీరవాసరం గ్రామానికి చెందిన చైతన్య గ్రామ సంఘానికి రూ.3.40 లక్షల విలువైన గడ్డి చుట్టే యంత్రం స్ట్రా బ్యాలర్‌ను బుధవారం స్థానిక ఎంఎల్ఎ కార్యాలయం వద్ద ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అందించారు.

ఘనంగా ఎంపిపి వెంకటరామరాజు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - గణపవరం

ఎంపిపి దండు వెంకటరామరాజు (అర్ధవరం రాము) పుట్టినరోజు వేడుకలు బుధవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) ఎంపిపి వెంకటరామరాజుకు పుష్పగుచ్ఛాలందించి తెలిపారు. మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. ఎంపిపి కేక్ కట్ చేసి అందరికీ అందించారు.

పాందువ్వలో అన్న సమారాధన

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పాందువ్వ గ్రామంలో పున:నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఉండి, ఆచంట ఎంఎల్‌ఎలు మంతెన రామరాజు, చెరుకువాడ శ్రీ రంగనాథరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, మాజీ ఎంఎల్‌సి మంతెన వెంకట సత్యనారాయణరాజు, జనసేన పార్టీ పిఎసి సభ్యులు వేగేశ్న కనకరాజు సూరి పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి స్థలదాత గణపవరం కాశీరాజు, నిర్మాణానికి సహకరించిన రామకృష్ణంరాజు, వేగేశ్న బంగారమ్మ, ఎంఎస్ వర్మలను ప్రత్యేకంగా అభినందించారు. సుమారు మూడు వేల మందికి అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పట్టణంలోని 14వ వార్డులో ఉన్న శ్మశానవాటికలో రూ.68 లక్షల నిధులతో వాచ్‌మెన్ షెల్టర్, కర్మల భవనం, టాయిలెట్స్, గ్యాలరీ అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్రిమిలేయర్ మిషనరీ, గ్యాలరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా విద్యుత్ సౌకర్యంతో దహన సంస్కారాలు జరిపించేందుకు మిషనరీలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి వెంకటరమణ, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు కాగితపు సత్యవాణి, కౌన్సిలర్లు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు.. ఘోరాలు..

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన తూర్పు తాళ్లలోని కోడివారిమెరకలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం... మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి తూర్పు తాళ్లలోని కోడివారిమెరకకు చెందిన కంకటాల వెంకట్రావు(52) బుధవారం ఉదయం కూలి పనికి వెళ్లాడు. ఈ క్రమంలో కొండవీటి కొడకాచామకూరిపాలెం గ్రామాల మధ్య ఉన్న పంట కాలువను దాటుతుండగా విద్యుత్ వైర్ తెగిపడి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రులో గంజాయితో పట్టుబడిన సిహెచ్ఎస్.వరప్రసాద్, డి.సత్యనారాయణ, ఒక బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. గరగపర్రు శివారు చిలుకూరు రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు పోలీసులను చూసి ద్విచక్రవాహనంపై పారిపోయేందుకు ప్రయత్నించారు. ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బందితో కలిసి వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.27,500 విలువైన 5.500 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కుమార్తె కనిపించడంలేదని తండ్రి ఫిర్యాదు

పాలకోడేరు : తన కుమార్తె వినిత బుధవారం తెల్లవారుజాము నుంచి కనిపించడంలేదంటూ కోరుకొల్లు గ్రామానికి చెందిన డి.శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ.సత్యనారాయణ తెలిపారు. వీరవాసరం మండలంలోని నవుడూరు గ్రామానికి చెందిన ఒక యువకుడిపై అనుమానం ఉందని యువతి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పివిఎల్‌కు హారతులిస్తున్న గ్రామస్తులు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

గ్రామాల అభివృద్ధే తన లక్ష్యమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని కలిగొట్ల సచివాలయ పరిధిలో బుధవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, వైసిపి నాయకులకు గ్రామంలోని ప్రజలు హారతులతో బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, చింతలపాటి వెంకట్రామరాజు మాట్లాడుతూ కలిగొట్ల గ్రామం టిడిపికి పట్టుకొమ్మ అని అటువంటి గ్రామంలో పివిఎల్ నరసింహరాజు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అనంతరం పివిఎల్.నరసింహరాజు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి గడపగడపకు తిరుగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, పార్టీ గ్రామ అధ్యక్షులు చింతలపాటి రఘుపతిరాజు, పార్టీ మండల అధ్యక్షులు పివిఆర్‌కె ఆంజనేయరాజు, రూరల్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ పేరిచర్ల నరసింహరాజు పాల్గొన్నారు.

ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై వర్క్ షాప్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

వైఎన్ కళాశాల హెచ్‌ఆర్‌డి సెంటర్ ఆధ్వర్యంలో ఉపాధి సామర్థ్యాలు అంశంపై డిగ్రీ విద్యార్థులకు బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా న్యూ ఢిల్లీకి చెందిన డాక్టర్ షేక్ సులేమాన్ విచ్చేసి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో డిగ్రీ పట్టాతో పాటుగా లైఫ్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్‌లో అవగాహనతో పాటు సోషల్ స్కిల్స్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్, సిస్టెమ్ బేస్డ్ స్కిల్స్‌లో నైపుణ్యత సంపాదించాలన్నారు.

ఘనంగా కోటేశ్వరరాజు పుట్టినరోజు

ప్రజాశక్తి - పాలకోడేరు

దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు (కోటి రాజు) టిడిపి బలోపేతానికి అహర్నిశలు పనిచేసే వ్యక్తి అని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు కోటేశ్వరరాజు పుట్టినరోజు వేడుకను బుధవారం పాలకోడేరులోని ఆయన స్వగృహం వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఎల్ఎ రామరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఠాగూర్ కోటేశ్వరరాజు దంపతులను శాలువాతో సత్కరించారు. ఎంపి రఘురామకృష్ణంరాజు ఫోన్‌లో కోటేశ్వరరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

జలదిగ్బంధనంలో ఆరుగొలను

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి మండలంలోని ఆరుగోలను గ్రామం జలమయమైంది. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం తో ముంపునకు కారణమైందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన గడపగడపకు ప్రభుత్వంలో ఈ సమస్యను దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ఆయన స్పందిస్తూ డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని అవసరమైతే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కూడా తొలగించి ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి చంద్రరాజును, ఎంపిడిఒ వేణుగోపాల్‌ను, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో బుధవారం కురిసిన వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. సుమారు మోకాళ్ల లోతు నీరు వీధుల్లో ప్రవహిస్తోంది. అధికారులు సత్వరమే స్పందించి జలదిగ్బంధంలో ఉన్న ఆరుగొలను గ్రామాన్ని కాపాడాలని, మురుగునీటి వ్యవస్థను మెరుగు పరచాలని, డ్రెయినేజీ తవ్వాలని గ్రామస్తులు, సర్పంచి బుచ్చిబాబు కోరుతున్నారు.

జలమయమైన వీధి

జువ్వలపాలెం పంచాయతీ సిబ్బందికి సత్కారం



సత్కారం అందుకుంటున్న పంచాయతీ సిబ్బంది

ప్రజాశక్తి - కాళ్ల

నీటి సమృద్ధితో సుపరిపాలన అందించిన గ్రామంగా జువ్వలపాలెం గ్రామపంచాయతీకి అవార్డు లభించింది. జువ్వలపాలెం గ్రామంలో నాలుగు వేల మంది జనాభా ఉన్నారు. ప్రతిరోజు రెండు పూటలా నీటిని పంపిణీ చేస్తున్నారు. గ్రామంలో ఐదు మంచినీటి చెరువులు ఉన్నాయి. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మంచినీటి చెరువును ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బాధ్యతగా గ్రామ సర్పంచి మీసాల రమణ, ఉప సర్పంచి కఠారి లక్ష్మీపతిరాజు కృషి చేస్తున్నారు. రక్షిత మంచినీటి పథకం చెరువు సుమారు నాలుగు ఎకరాలు విస్తీర్ణం నీటిని సమృద్ధిగా నింపారు. రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు, నాలుగు ఫిల్టర్ బెడ్లు ఉన్నాయి. 777 కుళాయిలు నాలుగు సెక్షన్ల ద్వారా ఫిల్టర్ చేసిన నీటిని అందిస్తున్నారు. అన్ని ప్రాంతాలకు నిరంతరం నీటి సరఫరాను అందించింది. నాణ్యమైన నీటి సరఫరాను నిరంతరాయమైన పరిశుభ్రమైన నీటి సరఫరాను కలిగి ఉన్న ఏకైక గ్రామం జువ్వలపాలెం. జువ్వలపాలెం గ్రామపంచాయతీ ఉత్తమ పంచాయతీగా మండల స్థాయి అవార్డును సాధించింది. గ్రామ సర్పంచి మీసాల రమణ, గ్రామ కార్యదర్శి గొట్టుముక్కల కృష్ణశివరామరాజు, మండల కో-ఆప్షన్ సభ్యులు గుట్టం బెన్హర్, ఎంపిటిసి సభ్యులు మీసాల శ్రీనివాస్, ఉప సర్పంచి కఠారి లక్ష్మీపతిరాజులను కాళ్ల ఎంపిపి పి.శిరీషవిశ్వనాథరాజు, ఎంపిడిఒ జి.స్వాతి, సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందించారు. గ్రామ కార్యదర్శి గొట్టుముక్కల కృష్ణ శివరామరాజు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పంచాయతీలే కీలకమన్నారు.

పెన్షనర్లకు ఇకెవైసి తప్పనిసరి

భీమవరం : ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని ఉప ఖనిజ అధికారి ఎవి.రవివర్మ సూచించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు ఇకెవైసిపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడుతూ ఈ నెల పదో తేదీ ఇకెవైసి చేయించుకోవాలని తెలిపారు. ఈ నెల ఎనిమిదో తేదీన పాలకోడేరు, 9న వీరవాసరం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ట్రెజరరీ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఇకెవైసి నమోదు ప్రక్రియను ఆండ్రాయిడ్ ఫోన్‌లో కూడా వారి సిఎఫ్ఎంఎస్ ఐడి లాగిన్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ఇకెవైసి నమోదులో సందేహాలు, సేవల నిమిత్తం కార్యాలయ సిబ్బంది టిఎస్.భాస్కరరావు 9912243377, ఉపఖజానా అధికారి 6302618446 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్, కార్యదర్శి పి.సీతారామరాజు, యుజిసి పెన్షనర్ల సంఘం అధ్యక్షులు సత్యనారాయణరాజు, కార్యదర్శి సుబ్బారావు, రాష్ట్ర ట్రెజరర్ అప్పలరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప ఖనిజ అధికారి రవివర్మ

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - కాళ్ల

ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర రైతు కార్యచరణ సమితి ట్రెజరర్ మంతెన వెంకటరవివర్మ డిమాండ్ చేశారు. ఏలూరుపాడులో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంతెన వెంకట రవివర్మ మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల వరి, ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. చేతికి అందివచ్చిన వరి పంట రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మాసూళ్లకు వచ్చిన పంట, ధాన్యం రాశులు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ఈ నష్టానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి మద్దతు ధరకు ప్రభుత్వమే తక్షణం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వాతావరణ మార్పుల వల్ల నష్టపోయిన ఆక్వా రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

వెంకట రవివర్మ

అనధికార లే అవుట్లు కొనుగోలు చేయొద్దు

మొగల్తూరు : అనధికార లే అవుట్లో స్థలాలు కొనుగోలు చేస్తే ఇబ్బందులు తప్పవని జిల్లా గ్రామ పంచాయతీల అధికారి జివికె.మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సంపద తయారీ ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మొగల్తూరులో విలేకర్లతో మాట్లాడారు. పంచాయతీల నుంచి గ్రామాల్లో గుర్తించిన అనధికార లే అవుట్లకు రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సర్వే నెంబర్లు వివరిస్తూ పంపినట్లు తెలిపారు. సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలని, మే నెలాఖరునాటికి కచ్చా డ్రెయిన్లు, పూడిక తీత పనులు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయనతో పాటు ఎంపిడిఒ ఆర్‌సి ఆనంద్‌కుమార్, ఎన్.శివప్రసాద్ యాదవ్, పంచాయతీ కార్యదర్శులు జయరాజు, చిన్నా పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అన్ని విధాలా అభివృద్ధి చెందిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజరాజేశ్వరి అన్నారు. బుధవారం కళాశాలలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 165 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా పాలకొల్లుతో పాటు 14 అటానమస్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయని చెప్పారు. కళాశాల అన్నివిధాలా అభివృద్ధి చెందిందని, వచ్చే నెల నాక్ టీం మూడో సారి కళాశాలకు వస్తున్నారని తెలిపారు. తమ కళాశాలలో ఆఖరి సంవత్సరం ఐదో సెమిస్టర్‌లోనే చదువుతూ 178 మంది విద్యార్థులు రూ.15 వేలు స్టైఫండ్‌ను పొందుతున్నారన్నారు. కళాశాలలో ఆక్వా కల్చర్ కోర్సుతో పాటు పలు కోర్సులకు ఇతర జిల్లాల వారు ప్రవేశాలు పొందుతున్నారన్నారు. ఇంటర్ ఫలితాలు రావడంతో పలువురు విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రవేశాలు కోరుతున్నారని చెప్పారు. కళాశాలలో ఉన్న ఇతర సౌకర్యాలు ఆమె వివరించారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి

రేపటి నుంచి వేసవి వినోదం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పొలమూరు కలిదిండి సూర్యనారాయణ రాజు జనవిజ్ఞాన కళావేదిక వద్ద డివైఎఫ్ఐ, ఐద్వా సహకారంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల ఐదో నుంచి వేసవి వినోద కార్యక్రమం నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక యూత్ కన్వీనర్ చింతపల్లి మావో బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కాళ్ల : మండలంలో ప్రథమంగా జువ్వలపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపు పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర అన్నారు. జువ్వలపాలెం ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుడు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామిని అభినందించారు.

వీరవాసరం : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి వినోదం ఈ నెల ఐదో తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బాజింకి కృష్ణారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరవాసరం శాఖా గ్రంథాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - మొగల్తూరు

బాల్యవివాహాలు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ సిడిపిఒ ఊర్మిళ హెచ్చరించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయంలో పాస్టర్లకు, దేవాలయాల పూజార్లకు, ముస్లిం పెద్దలకు బాల్యవివాహాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని తిల్లపూడి గ్రామంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న వారి చేలు, కల్లాల్లో తడిసిన ధాన్యాన్ని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన సమయానికి సంచులు అందించకలేకపోవడంతో ధాన్యం పట్టుకోవడానికి సంచులు లేక రైతులు నష్టపోయారన్నారు. రంగు మారిన, మొలకెత్తిన, కల్లాల్లో ధాన్యానికి కూడా సంచులు ఇచ్చి ఆ ధాన్యం కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

గణపవరం : రైతుల వద్ద నుంచి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని గణపవరం మండల రైతు సంఘం నాయకులు కోరారు. రైతు సంఘం నాయకుల బృందం మండలంలో తడిసిన ధాన్యాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు గుత్తుల శ్రీను, పి.నరసింహమూర్తి మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని కోరారు.

ఆచంట : అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని టిడిపి జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. మండలంలో అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ఆదుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నరసాపురం టౌన్ : నరసాపురం నియోజకవర్గంలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పిఎసి సభ్యులు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ ఛైర్మన్ బొమ్మిడి నాయకర్ బుధవారం కలిసి పరామర్శించారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఉండి : రైతే రాజు, రైతు దేశానికి వెన్నెముక అనే పదాలు నానుడి లోనే ఉన్నాయి తప్ప ఆచరణలో లేవని ఆ పదాలకు తగిన న్యాయం చేయాలని జనసేన పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు డిమాండ్ చేశారు. మండలంలోని గ్రామంలో పంట పొలాలను, ధాన్యం పట్టుబడులను జుత్తిగ నాగరాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ తడిచిన ధాన్యానికి మద్దతు ధర కల్పించకపోతే రైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు.

డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీలు

పోడూరు : మండలంలో వైద్యఆరోగ్య శాఖ కవిటం సబ్‌సెంటర్‌ను డిఎంహెచ్ఒ ఉమామహేశ్వరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎల్.కామరాజు, సిబ్బంది మేరీగ్రేస్, జి.పద్మావతి, శ్రీదేవి, ఉషారాణి, ఝాన్సీ, దీప్తి పాల్గొన్నారు.

HON'RABLE PRINCIPAL FAMILY COURT
CUM IV ADDL DISRICT JUDGE
VIJAYAWADA
M.C. NO. 100/2019
Between:
1. తలకాయల విజయకుమారి
2. తలకాయల డినయిస్సీ దర్శని
Being minor, Rep. by mother, 1st petitioner
... Petitioners
AND
తలకాయల రాజశేఖర్, తండ్రి. జ్ఞానప్రసాద్, CRPF Constiable, R/o హౌసింగ్ బోర్డు కాలనీ, ఎల్.ఐ.జి: 1-214, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా.
.... Respondent
పై నెంబరు పిటిషన్‌లో 1వ పిటిషనరుకు రూ.10,000లు, 2వ పిటిషనరుకు రూ.6,000లు మనోవర్తి కోరుతూ పిటిషన్‌లో గౌరవ పై కోర్టులో మీ యొక్క హాజరు నిమిత్తం నోటీసులు మీ అడ్రసుకు అనేక పర్యాయములు పై గౌరవ కోర్టు ద్వారాను, రిజిష్టర్డు పోస్టు ద్వారాను పంపిననూ వాటిని మీరు అందుకొని యుండలేదు. అందువలన మీరు ది.16-05-2023వ తేదీ ఉదయం గం.10.30 ని.లకు స్వయముగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై గౌరవ పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. అట్లు మీరు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు మనోవర్తి పిటిషన్‌ను తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.
/// BY COURT ORDER ///
తలకాయల విజయకుమారి
పిటిషనరు,
విజయవాడ
విజయవాడ
ది.03-05-2023

మహారాజశ్రీ స్పెషల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో
C.C. No. 474/2021
ఫిర్యాది: దువ్వపు బాలాజి
మరియు
ముద్దాయి: గురజారావు నాగ వెంకట సత్యనారాయణ
నిందితుడు హాజరు నిమిత్తం సెక్షన్ 82
సి.ఆర్.పి.సి. ప్రకారం వేయించిన ప్రకటన
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, పై నెంబర్ గ్రంధములో ముద్దాయి గురజారావు నాగ వెంకట సత్యనారాయణ, తండ్రి: సత్యనారాయణ, నివాసం: డోర్ నెం. 1-18, మండపాక గ్రామము, తణుకు మండలము, పశ్చిమగోదావరి జిల్లా వారికి ఎన్.బి.డబ్ల్యూ వారెంటు జారీ కాబడి పై నెంబరు కేసులో ఎన్.ఐ. యాక్టు సెక్షన్ 138 క్రింద కేసు నెం. 474/2021 కేసులో నేరానికి పాల్పడినట్లు (లేదా నేరానికి పాల్పడినట్లు అనుమానించబడినారని) శ్రీ కోర్టు వారి ఎదుట ఫిర్యాదు చేయబడినది. మీ పై సమన్స్, నోటీసులు జారీ చేయుటకు దారి తీసినది. సదరు సమన్స్, నోటీసులు అమలు జరుపుటకు మీరు పరారీలో ఉన్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై **ది. 11-5-2023 సం॥రం తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.00 లకు** స్వయంగా గాని, ప్లీడరు ద్వారాగా గాని హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.
ఫిర్యాది తరుపు అడ్వకేట్
G.N.V.S.CH.Y.PRASAD
తణుకు — Advocate, Tanuku
తేది:02-05-23 — Cell: 7799235999

మహారాజశ్రీ స్పెషల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో
C.C. No. 229/2019
ఫిర్యాది: నల్లీ తిరుమల నాగ సాయి పవన్ మణికంఠ
మరియు
ముద్దాయి: ఆవిడి సుబ్రహ్మణ్యం
నిందితుడు హాజరు నిమిత్తం సెక్షన్ 82
సి.ఆర్.పి.సి. ప్రకారం వేయించిన ప్రకటన
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, పై నెంబర్ గ్రంధములో ముద్దాయి ఆవిడి సుబ్రహ్మణ్యం, తండ్రి: వెంకటరావు, నివాసం: ఫ్లాట్ నెం. 502, అవినాష్ రెసిడెన్సీ, పాతూరు, తణుకు మండలము, పశ్చిమగోదావరి జిల్లా వారికి సమన్స్, నోటీసు జారీ కాబడి పై నెంబరు కేసులో ఎన్.ఐ. యాక్టు సెక్షన్ 138 క్రింద కేసు నెం. 229/2019 కేసులో నేరానికి పాల్పడినట్లు (లేదా నేరానికి పాల్పడినట్లు అనుమానించబడినారని) శ్రీ కోర్టు వారి ఎదుట ఫిర్యాదు చేయబడినది. మీ పై సమన్స్, నోటీసులు జారీ చేయుటకు దారి తీసినది. సదరు సమన్స్, నోటీసులు అమలు జరుపుటకు మీరు పరారీలో ఉన్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై **ది. 11-5-2023 సం॥రం తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.00 లకు** స్వయంగా గాని, ప్లీడరు ద్వారాగా గాని హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.
ఫిర్యాది తరుపు అడ్వకేట్
G.N.V.S.CH.Y.PRASAD
తణుకు — Advocate, Tanuku
తేది:02-05-23 — Cell: 7799235999

మహారాజశ్రీ స్పెషల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో
C.C. No. 183/2021
ఫిర్యాది: గూడూరి వెంకట సూర్య రామకృష్ణ
మరియు
ముద్దాయి: పెద్దిరెడ్డి నాగరాజు
నిందితుడు హాజరు నిమిత్తం సెక్షన్ 82
సి.ఆర్.పి.సి. ప్రకారం వేయించిన ప్రకటన
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, పై నెంబర్ గ్రంధములో ముద్దాయి పెద్దిరెడ్డి నాగరాజు, తండ్రి: దేవేంద్రారావు, నివాసం: డోర్ నెం. 3-219/4, షాప్ నెం. 4, శ్రీ సాయి అంబికా టవర్స్, నియర్ పెట్రోల్ బంక్, కె.సావరం, ఉండ్రాజవరం మండలం, పూర్వం పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా వారికి ఎన్.బి.డబ్ల్యూ వారెంటు జారీ కాబడి పై నెంబరు కేసులో ఎన్.ఐ. యాక్టు సెక్షన్ 138 క్రింద కేసు నెం. 183/2021 కేసులో నేరానికి పాల్పడినట్లు (లేదా నేరానికి పాల్పడినట్లు అనుమానించ బడినారని) శ్రీ కోర్టు వారి ఎదుట ఫిర్యాదు చేయబడినది. మీపై అరెస్టు వారెంటు జారీచేయుటకు దారి తీసినది. సదరు వారెంటు అమలు జరుపుటకు మీరు పరారీలో ఉన్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై **ది. 05-6-2023 సం॥రం తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.00 లకు** స్వయంగా గాని, ప్లీడరు ద్వారాగా గాని హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.
ఫిర్యాది తరుపు అడ్వకేట్
G.N.V.S.CH.Y.PRASAD
తణుకు — Advocate, Tanuku
తేది:02-05-23 — Cell: 7799235999

పేరు మార్పు
కోలాటి సోమేశ్వరరాజు (కొత్త పేరు), తండ్రి: కోలాటి ఆంజనేయులు (కొత్త పేరు), గతంలో నా పేరు కోరాటి సోమేశ్వరరాజు (పాత పేరు), తండ్రి: కోరాటి ఆంజనేయులు (పాత పేరు), డోర్ నెం. 5-77/1, మల్లిపూడి గ్రామం, పెనుమంట్ర మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివసించుచున్నాను. ఇప్పుడు నా పేరును **కోరాటి సోమేశ్వరరాజు (పాత పేరు), తండ్రి: కోరాటి ఆంజనేయులు (పాత పేరు) నుండి కోలాటి సోమేశ్వరరాజు (కొత్త పేరు), తండ్రి: కోలాటి ఆంజనేయులు (కొత్త పేరు)** మరియు నా తల్లి పేరు **కోరాటి మాణిక్యమ్మ (పాత పేరు) నుండి కోలాటి మాణిక్యమ్మ (కొత్త పేరు)గా** మార్చుకున్నాను. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్త పేరును ఉపయోగించవలెను.
సెల్: 9346496939

పాస్‌పోర్టు పోయినది
యలమంచిలి మండలం, నేరేడుమిల్లి గ్రామంకు చెందిన పెచ్చెట్టి ధనశ్రీరామ్, తండ్రి: వెంకటేశ్వర్లు (ఆధార్ నెంబర్ 952986825845) తెలియ జేయునది ఏమనగా ది. 20-4-2023న నా ఒరిజినల్ పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీసుకునే నిమిత్తం మోటార్ సైకిల్‌పై అడవిపాలెం వెళు తుండగా నా పాస్‌పోర్టు, ఇతర డాక్యుమెంట్స్ ఉన్న సంచి దారిలో పడిపోయినవి. దారి పొడవునా ఎంత వెతికినా కనిపించలేదు. నా ఒరిజినల్ పాస్‌పోర్టు (నేను వైజాగ్‌లో ది.17-8-2017న పొందిన ఒరిజినల్ పాస్‌పోర్టు (R 2800681), ఇతర డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికితే నాకు ఈ నెంబర్‌కు తెలియపరచగలరు.
పెచ్చెట్టి ధన శ్రీరామ్
డోర్ నెం. 3-46, అడవిపాలెం
యలమంచిలి మండలం
సెల్: 7995393858

దస్తావేజు పోయినది
ప॥గో॥జిల్లా, భీమవరం మండలం, కొవ్వాడ పుంత రోడ్, డో.నెం. 7-180, బైపాస్ రోడ్ గ్రామ కాపురస్తులు లేటు మహ్మద్ సుల్తాన్ షరీఫ్ గారి కుమారుడు మహ్మద్ ఆసిఫ్ పాషా అను నాకు చెందిన ది.06-04-2006 సం॥రం తేదీన భీమవరం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన దస్తావేజు నెం. 2172/2006 గా రిజిష్టరు కాబడినది. ఈ ఒరిజినల్ దస్తావేజు సంచిలో పెట్టుకొని ది.11-04-2023వ తేదీన మా ఇంటి నుండి భీమవరం 1వ పట్టణంలో గల జిరాక్సు సెంటర్ నందు జిరాక్సు తీయించుకొనుటకు మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా మార్గ మధ్యలో అనగా భీమవరం 1వ పట్టణం పరిధిలో ఓల్డ్ వెంకట్రామా థియేటర్ సమీపంలో సంచి జారి పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది వారికి అందజేయవలసినదిగా కోరుచున్నాను.
మహ్మద్ ఆసిఫ్ పాషా
తండ్రి: సుల్తాన్ షరీఫ్, కొవ్వాడ పుంత,
సెల్: 98497 33477

తణుకు పురపాలక సంఘం
టెండరు నోటీసు
ఆర్.ఓ.సి. నెం. ODW/01/85/2023/ఇ1 — తేది.02-05-2023
తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెల్పిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

		ఇ.సి.వి. (రూ. లక్షలలో)
1. బిల్డింగ్ పనులు	2 నెం.లు	38.52
2. డ్రెయిను పనులు	2 నెం.లు	12.55

సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 04-05-2023వ తేదీ నుండి చూడవచ్చును.
సం/- కమిషనరు
తణుకు పురపాలక సంఘం